క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని కేవీఆర్ కాలనీ, పంచాయతీ కార్యాలయం ఏరియా, శివాలయం ఏరియా, యూనియన్ బ్యాంక్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రాంగణ ఎంపికల్లో 22 మంది ఎంపిక

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళ ఫార్మసీ కళాశాలలో చెన్నైకు చెందిన ప్రభాస్ వీ కేర్ హెల్త్ సంస్థ వారు ఫార్మా.డి విద్యార్థినులకు శుక్రవారం ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. వీటిలో 22 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలత మాట్లాడుతూ కళాశాలకు చెందిన 22 మంది విద్యార్థినులు వేరు వేరు ప్రాంతాల్లో కన్సల్టెంట్ డాక్టర్లుగా ఉద్యోగాలు సాధించారన్నారు. ఎంపికైన ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.4.50 లక్షల చొప్పున జీతభత్యాలు చెల్లిస్తారని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను కళాశాల మానవ వనరుల అధికారి కిరణ్‌కుమార్, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

ఆకట్టుకున్న భూగోళం నాటిక

రామవరప్పాడు: వైఎస్సార్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నిడమానూరులో గురువారం రాత్రి గ్రామ సర్పంచ్ శీలం రంగారావు ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ వారిచే భూగోళం నాటికను ప్రదర్శించారు. తొలుత వైఎస్సార్ చిత్రపటం వద్ద కళాకారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రముఖ రంగస్థల, సినీ నటుడు ఎం.సంజీవి రచించిన, వేంపాటి రమేష్ దర్శకత్వం వహించిన భూగోళం నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

పెనమలూరు: ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అమెరికాకు చెందిన నార్త్ సౌత్ ఫౌండేషన్ ఉపకార వేతనాలను శుక్రవారం పంపిణీ చేసింది. సంస్థ కోఆర్డినేటర్ సూరపనేని వెంకటరత్నం రూ 1.70 లక్షల ఉపకార వేతనాలు విద్యార్థులకు అందచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కడియాల రవి, అధ్యాపకుడు డాక్టర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు



పెనమలూరు: పోరంకిలో పేదలకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శుక్రవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన 17 కుటుంబాలకు వణుకూరు జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు మంజూరు చేసి పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

రామవరప్పాడు: అవనిగడ్డకు చెందిన విద్యార్థి ఫణికృష్ణకు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద కోటి రూపాయలు మంజూరు అయిన సందర్భంగా హనుమాన్‌పేటలోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో శుక్రవారం ఆర్యవైశ్య నాయకులు విద్యార్థికి అభినందనలు తెలిపారు. అతను బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో శ్రీ వాసవీ ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు బుద్ధ వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య యువజన సంఘ ప్రధాన కార్యదర్శి హనుమంతు, కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి వెంటప్రగడ వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వెలుగూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

- ముంపునకు గురైన ప్రాంతాల్లో ఎమ్మెల్యే పార్థసారథి పర్యటన
- ఏనుగులకోడు పూడికతీత తీయండి



పెదపులిపాకలో అధికారులతో మాట్లాడుతున్న పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: అధిక వర్షాల కారణంగా ముంపునకు గురైన పంట పొలాలకు చెందిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే శుక్రవారం పెదపులిపాక, తాడిగడప ప్రాంతాల్లో ముంపున బారిన పడ్డ పంట పొలాలను పరిశీలించారు. రైతులు ఎమ్మెల్యే పార్థసారథికి వివరాలు తెలుపుతూ ఏనుగులకోడు డ్రెయిన్ పూడిక తీయక పోవడంతో వృథానీరు పారుదల జరగడం లేదన్నారు. పంట బోదెలు ఆక్రమణలకు గురయ్యాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఎమ్మెల్యే పార్థసారథి డ్రెయినేజీ బోర్డు ఉన్నతాధికారులు, ఈఈ విజయలక్ష్మితో మాట్లాడారు. దాదాపు 20 కిలోమీటర్ల మేర ఉన్న ఏనుగుల కోడు డ్రెయిన్ పూడికను తక్షణం తీయాలని కోరారు. ఇందుకు అయ్యే ఖర్చు రూ.20 లక్షలను ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. రెండు రోజుల్లో డ్రెయిన్ పూడికతీత పనులు పూర్తి చేయాలని కోరారు.

వరి విత్తనాలు అందించడానికి చర్యలు

అధిక వర్షాల కారణంగా వరి చేలు నీట మునిగి దెబ్బతినడంతో తక్కువకాలంలో సాగు జరిగే వరి విత్తనాలు ఇస్తామన్నారు. దీనిపై ఎమ్మెల్యే పార్థసారథి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. మండల పరిధిలో రెండు వేల ఎకరాల వరి పంట దెబ్బతినడంతో 20 క్వింటాళ్ల వరి విత్తనాలు అందించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీనిపై ఏవో కనకమేడల శైలజను నివేదిక ప్రభుత్వానికి పంపాలన్నారు. పంట కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని అధికారులకు చెప్పారు. పంట పొలాలు పూర్తిగా మునగడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెదపులిపాక సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి, తాడిగడప, పెదపులిపాక రైతులు, అధికారులు పాల్గొన్నారు.

అన్ని విధాలా అండగా ఉంటాం

కంకిపాడు: రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని, ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మద్దూరు గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపు బారిన పడ్డ పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు. సర్పంచ్‌లు చిప్పల రామదాసు, పి.వరప్రసాద్, ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు, నాయకులు పోతాబత్తిన నాగార్జున, రావి సాంబశివరావు, రావి త్రినాథ్ రావు, ఆంజనేయులు పలువురు పాల్గొన్నారు.

పెనమలూరు ఏఎంసీ పాలకవర్గం ఖరారు

- చైర్‌పర్సన్‌గా నానావత్ చిన్ని
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వెల్లడి



నానావత్ చిన్ని

పెనమలూరు: పెనమలూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్‌పర్సన్‌గా యనమలకుదురుకు చెందిన ఎస్టీ మహిళ నానావత్ చిన్నిని ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వెల్లడించారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ పెనమలూరు అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీకి నూతన పాలక వర్గాన్ని ప్రభుత్వం నియమిస్తూ జీవో 529 జారీ చేసిందన్నారు. జగనన్న పాలనలో బడుగు బలహీన వర్గాలకు ఉన్నత స్థానం కల్పించడం కోసం పెనమలూరు మార్కెటింగ్ కమిటీకి చైర్‌పర్సన్‌గా ఎస్టీ మహిళకు అవకాశం ఇచ్చారన్నారు. కమిటీ వివరాలు ..

కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

చైర్‌పర్సన్ నానావత్ చిన్ని(యనమలకుదురు), వైస్ చైర్మన్ మాదు వసంతరావు(కంకిపాడు), డైరెక్టర్లుగా కొడాలి సుష్మ(పెనమలూరు), నటుకుల ప్రసాద్(కంకిపాడు), ఎండీ షఫీఉన్నీసా (కానూరు), బొమ్మారెడ్డి శ్రీనివాసారెడ్డి (చలివేంద్రపాలెం), వడుగు రమాదేవి(మద్దూరు), ఆకునూరు మాణిక్యం (పోరంకి), మండూరు కోటేశ్వరరావు(గోడవరం), చిట్టూరి సుబ్బారావు (గంగూరు), పోలవరపు రవి (గోసాల), తాళ్లూరి మరియబాబు (కంకిపాడు), చోరగుడి అనిత (గొడవర్రు), ఎండి.షహీనాబేగం (తాడిగడప), పోవూరి రోహిణి వీర వెంకటలక్ష్మి (పోరంకి) ఉన్నారు. వీరితోపాటు పెదపులిపాక సొసైటీ అధ్యక్షుడు వెలగపూడి వరప్రసాద్, జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి, ఏడీ పశువర్ధక శాఖ, కంకిపాడు సర్పంచి సభ్యులుగా ఉంటారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కాసరనేనివారిపాలెంలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీబాబు



నున్న జెడ్పీ హైస్కూల్లో మొక్కలు నాటుతున్న సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్

ఉయ్యూరు: పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ చీలి కల్పన కోరారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉయ్యూరు పట్టణం, మండలంలోని 11 గ్రామాల్లో మొక్కలు నాటారు. కలవపాములలో ఎంపీపీ చీలి కల్పన, సర్పంచి పొనుగుమాటి బాలస్వామి మొక్కలు నాటారు. బోళ్లపాడులో సర్పంచ్ తుమ్మూరు సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, కాటూరులో సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి, ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఆర్డీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విమాదేవి, తోట్లవల్లూరు రోడ్డులో ఎస్ఈబీ సీఐ ఎంకే ఖదీర్ మొక్కలు నాటారు. మునిసిపాలిటీలోని 20 వార్డుల్లో ఆయా వార్డు కౌన్సిలర్లు మొక్కలు నాటారు. చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

పెనమలూరు: ఫౌండేషన్ ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా మెప్మా మండలినికి వివిధ రకాల మొక్కలు పంపగా వాటిని శుక్రవారం జగనన్న కాలనీలు, ప్రభుత్వ పాఠశాలల్లో నాటారు. ఎంపీడీఓ సునీతాశర్మ, పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు, ఎంఈవో 1 శేషగిరిరావు, ఎంఈవో 2 కనకమహాలక్ష్మి, ఏవో లోయ శివశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: కాసరనేనివారిపాలెంలో అంగన్‌వాడీ, పంచాయతీ కార్యాలయాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రరావు, తహసీల్దార్ పి.ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉదయ్‌బాస్కర్, మద్దూరు, కాసరనేనివారిపాలెం సర్పంచ్‌లు పాల్గొన్నారు.

- చలివేంద్రపాలెంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, మాజీ సర్పంచ్ కొండా రామిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్రారపు కోటిలింగం, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.
- గొడవర్రు జెడ్పీ పాఠశాలలో హెచ్ఎం కె.సుబ్రహ్మణ్యం, విద్యాకమిటీ వైస్ చైర్మన్ అంకమ్మ, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్, ఎంపీడీఓ బీఎల్‌బీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంరూరల్: గోపవరపుగూడెంలో సర్పంచ్ నల్లూరి వెంకటేశ్వరరావు మొక్కలు నాటారు.

గన్నవరంరూరల్: కొత్తగూడెం ఎంపీపీ పాఠశాల ఆవరణలో జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని మొక్కలు నాటారు. సర్పంచ్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి బాపూజీ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వీరవల్లి జెడ్పీ హైస్కూల్‌లో, రేమల్లె జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటారు.

గన్నవరం: మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి ఏఎంసీ డైరెక్టర్లు, సిబ్బందితో కలిసి ఆమె మొక్కలు నాటారు. సర్పంచి నిడమర్తి సౌజన్య, ఏఎంసీ డైరెక్టర్లు తుమ్మల రమాదేవి, మోటమర్రి శేఖర్, ఆదిలక్ష్మి, కార్యదర్శి కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు. అల్లాపురం ఎంపీపీ పాఠశాల ఆవరణలో సర్పంచి డొక్కు సాంబశివవెంకన్నబాబు మొక్కలు నాటారు.

చిత్తశుద్ధితో యనమలకుదురు అభివృద్ధి



యనమలకుదురులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: యనమలకుదురు అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నానని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చెప్పారు. గ్రామంలో హోసన్న మందిరంలో శుక్రవారం స్థానికులతో జరిగిన సమావేశంలో ప్రసంగించారు. యనమలకుదురు గ్రామాభివృద్ధికి ఇప్పటికే పెద్ద ఎత్తున నిధులు వెచ్చించామని తెలిపారు. గ్రామంలో కాలువ కట్టలను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశామని, కొండవెనుక ప్రాంతంలో రోడ్డు నిర్మించామన్నారు. అసంపూర్తి పనులను త్వరగా చేయాలన్నారు. హోసన్న మందిరం పక్కన డ్రెయినేజీ, అంతర్గత రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరటంతో ఎమ్మెల్యే పనులు చేయాలని అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.ప్రకాశరావు, ఫాదర్ రమేష్, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, వైఎస్సార్ సీపీ నేతలు వెలగపూడి వరప్రసాద్, యార్లగడ్డ వీరబాబు, విజయ్‌కుమార్, గోపాలకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అత్తింటివారిపై వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తతోపాటు అత్తింటివారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం మురళీనగర్‌కు చెందిన భానురేఖ 2005లో అనీల్‌కుమార్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఇద్దరు సంతానం. ఆమె భర్త అనీల్ దురలవాట్లకు బానిసై అదనపుకట్నం తీసుకురావాలని ఆమెను వేధిస్తున్నాడు. అతనిపాటు అత్తింటివారు వేధించడం మొదలుపెట్టారు. ఆమె భర్త అప్పులు చేసి 2018లో అమెరికాకు వెళ్లి తిరిగి రాలేదు. అక్కడ మరో మహిళను అనీల్ వివాహం చేసుకున్నాడు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు భర్త అనీల్, మామ కాశీరత్నం, అత్త రుక్మిణిదేవి, ఆడపడుచు సుస్మితపై కేసు నమోదు చేశారు.

ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే వంశీ పర్యటన



ముంపు ప్రాంతంలోని నిరాశ్రయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీమోహన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: అధిక వర్షాలతో ఇళ్లు నీట మునిగి నిరాశ్రయులైన పేదలకు అండగా ఉంటానని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. బాపులపాడు మండలం రంగయ్య అప్పారావు పేట, రామన్నగూడెం గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో నీట మునిగిన ఇళ్లు, వరి పొలాలను పరిశీలించారు. బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ తరఫున భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. వర్షపు నీరు పూర్తిగా తగ్గిపోయే వరకు బాధిత కుటుంబాలకు ప్రతిరోజు మూడు పూటలా ఆహారాన్ని అందిస్తానని చెప్పారు. అనంతరం నీట మునిగిన పొలాలను పరిశీలించారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యుడు పడకల కోటేశ్వరరావు, సర్పంచ్‌లు కాకొల్లు అన్నామణి, కాజా ప్రసాద్, రెడ్డి వీరాంజనేయులు, కలపాల భీమయ్య పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నేత, రంగస్థల కళాకారుడు జంపాన మృతి

కంకిపాడు: సీపీఎం సీనియర్ నేత, రంగ స్థల కళాకారుడు జంపాన నాగేశ్వరరావు (75) అనారోగ్యంతో శుక్రవారం ఉప్పలూరులో మృతి చెందారు. ఆయన వివిధ ప్రజాసంఘాల్లో పనిచేశారు. పౌరాణిక కళాకారుడిగా అనేక నాటక ప్రదర్శనలు ఇచ్చి కళాభిమానులు మెప్పించారు. నాగేశ్వరరావు మృతితో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.రఘు, ఇతర నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, జిల్లా అధ్యక్షుడు కె.శివనాగేంద్రం, సీపీఐ నేత మేరుగు విజయ్‌కుమార్, పలు రాజకీయ పార్టీల నేతలు మృతదేహాన్ని సందర్శించారు.

తక్కువ వడ్డీతో యూబీఐ రుణాలు



వెంకటరావును అభినందిస్తున్న సిబ్బంది, కస్టమర్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాడిగడప శాఖలో శుక్రవారం రుణాలు మంజూరు చేశారు. ముఖ్యఅతిథిగా మచిలీపట్నం రీజనల్ హెడ్ కె.వెంకటరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ యూబీఐలో రిటైల్, ఎంఎస్ఎంఈ రుణాలను తక్కువ వడ్డీతో త్వరితగతిన మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఎంఎల్‌పీ హెడ్ పరమేశ్వరరావు, తాడిగడప బ్రాంచ్ మేనేజర్ కృష్ణారావు, బ్యాంక్ ఇతర శాఖల మేనేజర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు. కస్టమర్లు యూనియన్ బ్యాంక్ అందిస్తున్న సేవలపట్ల సంతోషం వ్యక్తం చేశారు.

కౌలు రైతుసంఘం నేతల పరిశీలన

పెనమలూరు: వర్షాలతో నష్టపోయిన కౌలు రైతులకు న్యాయం చేయాలని మండల కౌలు రైతుసంఘం నేతలు ఎం.భాస్కరరావు, ఉప్పాడ త్రిమూర్తి, జోనపూడి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సంఘ నేతలు శుక్రవారం వణుకూరులో పర్యటించి వివరాలు తెలిపారు. వర్షాల కారణంగా కౌలు రైతులు కోలుకోలేని దెబ్బతిన్నారన్నారు. వీరికి నష్టపరిహారం ప్రకటించి ఇవ్వాలని కోరారు.

అంబాపురం గ్రామ సర్పంచికి ఉత్తమ సేవా అవార్డు

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామ సర్పంచి గండికోట సీతయ్య అందిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి హైదరాబాద్‌లోని హోప్ ది లాజికల్ యూనివర్సిటీ డాక్టర్ ఆఫ్ బెస్ట్ సోషల్ సర్వీసు అవార్డును ప్రదానం చేసింది. హైదరాబాదులో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేసినట్టు సర్పంచి సీతయ్య శుక్రవారం తెలియజేశారు. అవార్డు వచ్చిన సందర్భంగా పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ఆయన్ను అభినందించారు.

జగనన్న సురక్షతో 5150 మందికి లబ్ధి

ఉంగుటూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మండలంలో 5150 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు ఎంపీపీ వి.సరోజిని తెలిపారు. పెద అవటపల్లి సచివాలయం-2 ఆవరణలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ తిరుపతమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ వనజాక్షి, పంచాయితీ కార్యదర్శి బి.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారం

గన్నవరంరూరల్: ప్రజల సమస్యల సత్వర పరిష్కారం ప్రభుత్వ లక్ష్యమని కొత్తగూడెం సర్పంచ్ తూంపాటి రాంబాబు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష క్యాంపు జరిగింది. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఏఎస్సార్ కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి దుర్గ పాల్గొన్నారు.

సాంకేతిక విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్

దావాజిగూడెం(గన్నవరం): సాంకేతిక విద్యపై పట్టు సాధించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం డాక్టర్ తిమ్మరాజు సీతారామ్ అన్నారు. మండలంలోని దావాజిగూడెంలో ఉన్న ఎన్‌టీటీఎఫ్ కళాశాలలో శుక్రవారం రోప్ ఇన్ ప్రోగ్రామ్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన వృత్తి విద్య, సాంకేతిక శిక్షణ అందిస్తున్న ఎన్‌టీటీఎఫ్ అధ్యాపక బృందాన్ని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.మహీధర్, మేనేజర్లు పద్మజ, శ్రీనివాస్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణ పనులు

ఇళ్ల తొలగింపు



పోరంకి వద్ద ఆక్రమణల తొలగింపు పనులు పరిశీలిస్తున్న అధికారులు

పెనమలూరు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణకు పోరంకి చేపల కుండీల వద్ద ఉన్న ఇళ్లను అధికారులు శుక్రవారం తొలగించారు. జాతీయ రహదారిని పోరంకి పరిధిలో 150 అడుగుల మేర విస్తరించారు. చేపల కుండీల వద్ద 17 కుటుంబాలు ప్రభుత్వ భూమిలో పట్టాలు పొంది నివసిస్తున్నారు. వారికి గత పాలకులు సకాలంలో పరిహారం ఇవ్వక పోవడంతో నివాసితులు ఇళ్లు ఖాళీ చేయక పోవటంతో రోడ్డు విస్తరణ జరగలేదు. దీంతో ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వారికి ప్రభుత్వం పరిహారం కింద రూ 84.72 లక్షలను కొన్ని రోజుల క్రితం ఇచ్చింది. వారికి జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు కూడా కేటాయించారు. దీంతో రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న ఇళ్లను తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య సమక్షంలో జేసీబీతో తొలగించారు. ఎస్ఐ రాజేష్, డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ రమేష్, సర్వేయర్ శివరామకృష్ణ పాల్గొన్నారు.